# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో ఆర్థిక సేవలను ప్రజాస్వామ్యీకరించడంలో ఫిన్‌టెక్ ముఖ్యమైన పాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు కళాశాలలో రహస్య కెమెరాలు ఆరోపణల అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించారు.**
3. **సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న వన మహోత్సవంలో పాల్గొనాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ కోరారు.**
4. **రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో రహదారులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్థన్ రెడ్డి తెలిపారు**
5. **అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు మహారాష్ట్రలోని ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ – జీఎఫ్ఎఫ్ 2024 సదస్సులో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఆర్థిక సేవలను ప్రజాస్వామ్యీకరించడంలో ఫిన్‌టెక్ ముఖ్యమైన పాత్ర పోషించిందని తెలిపారు. భారత్‌లో ఫిన్‌టెక్ తీసుకొచ్చిన పరివర్తన కేవలం సాంకేతికతకే పరిమితం కాలేదని, ఆ సంస్థ సామాజిక ప్రభావం విస్తృతమైనదని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

---

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాలు ఉన్నాయనే ఆరోపణల అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించారు. వసతి గృహంలోరహస్య కెమెరాలు ఉన్నాయనే విద్యార్థినుల ఆందోళనపై విచారణ జరపాలని,. తక్షణమే జిల్లా మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఘటనా స్థలంలో విచారణ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మరోవైపు గుడ్లవల్లేరులోని ఇంజినీరింగ్ కళాశాల ఘటనపై కృష్ణాజిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇందుకు సంబంధించిన వివరాలను కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు వెల్లడించారు. బాలికల వసతి గృహంలో ఎలాంటి రహస్య కెమెరాలు గుర్తించలేదని తెలిపారు. విద్యార్థినులు ఈ సమస్య గురించి ఆందోళన పడవలసిన అవసరం లేదని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి తప్పు చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

---------------------------

ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే సెప్టెంబరు నెల పింఛన్‌లను రేపు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. వచ్చే నెల 1వ తేదీన ఆదివారం సెలవు కావడంతో ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయ అధికారులు రేపు పింఛన్‌లను పంపిణీ చేయనున్నారు.

ఇలా ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయల మడలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ రంజిత్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ నిన్న సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి గన్నవరం విమానాశ్రయం నుంచి కర్నూలు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్లో పుచ్చకాయలమడ చేరుకుని పింఛన్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని మారుమాల ప్రాంతాల్లోనూ రహదారులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకుణి మంత్రి కుటుంబసమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో రహదారులు సరిగ్గా లేవన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్రామ సడక్ యోజన పథకం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో త్వరలోనే నూతన రహదారులను అభివృద్ధి చేయనున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్యారిస్‌లో జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో ఈరోజు ముగ్గురు భారతీయ అథ్లెట్లు వివిధ విభాగాల్లో పోటీ పడతారు. టోక్యో డబుల్ మెడలిస్ట్ అవని లేఖరా ఆర్-2 మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 క్వాలిఫికేషన్, ఫైనల్లో పోటీపడతారు. ఇదే పోటీలో మోనా అగర్వాల్ కూడా పాల్గొంటారు. టోక్యో పారాలింపిక్స్ రజత పతక విజేత సుహాస్ యతిరాజ్ రెండవ గ్రూప్ స్టేజ్ మ్యాచ్ ఆడతారు.

---------------------------

సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న వన మహోత్సవంలో పాల్గొనాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ కోరారు. వన మహోత్సవం సందర్భంగా ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశవాళీ జాతుల మొక్కలే పర్యావరణానికి మేలు చేస్తాయని దేశీయ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.అందరికీ మేలు చేసే మొక్కలే మన నేస్తాలని పవన్ కల్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ ( 35 సెకన్లు)

ఇలా ఉండగా పల్నాడు జిల్లాలో భారీ వర్షాల కారణంగా నరసరావు పేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొనే వనమహోత్సవ కార్యక్రమం పర్యటన రద్దయ్యిందని అధికారులు తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పిలుపునిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొత్తూరులోని నగరవనంలో.. ఈరోజు జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో అధికారులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. విద్యార్థి దశ నుంచే పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రైతుల పంట సాగు ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలోని జలసౌధలో పంటల ఆయకట్టుకు సంబంధించిన నీటి ప్రాజెక్టులపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని చింతలపూడి ఎత్తిపోతల, నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద ఆయకట్టు సాగుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాగర్ ఎడమ కాలువ కింద చెరువులు నింపి తాగునీరు అందించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 5.70 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవితో మంత్రి నిన్న సమావేశమైయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సాక్షం అంగన్వాడీ పథకం కింద 50 కోట్ల రూపాయాలు, పీఎమ్ జన్మన్ కింద మరో 20 కోట్లు మంజూరు చేశారని, అడిగిన వెంటనే స్పందించి నిధులు విడుదల చేసినందుకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంజూరు చేసిన నిధులతో అంగన్వాడీలను సౌకర్యవంతంగా మారుస్తామన్నారు. బాలామృతం తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు 80 కోట్లను విడుదల చేసేందుకు కేంద్రమంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్టు సంధ్యారాణి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో ఏర్పాటవుతున్న వివిధ పరిశ్రమలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన వీసీఐసీ 5వ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ మాట్లాడుతూ.. కారిడార్‌లో రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేసి, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నెలవారీ ప్రణాళికతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని, భౌతిక, ఆర్థిక లక్ష్యాల ప్రగతి నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయగోదావరి జిల్లాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

======================